క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. వెంకటేశ్వర కాలనీ, బీసీ, ఎస్సీ కాలనీతోపాటు పంచాయతీ ముందు రోడ్డు మొత్తం 12 సీసీ రోడ్లకు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. త్వరితగతిన రోడ్ల పనులను పూర్తి చేయించడానికి కృషిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఈ–కేవైసీ విధిగా చేయించుకోండి

ఉప్పునుంతల: పీఎం కిసాన్ పథకం కోసం రైతులు విధిగా ఈ–కేవైసీతోపాటు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని ఏఓ సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ–కేవైసీ అప్‌డేట్ చేయించుకున్న రైతులకు మాత్రమే ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు విడతల్లో రూ.6వేలు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికీ మండలంలో ఈ–కేవైసీ అప్‌డేట్ చేయించుకోని రైతులు 229 మంది, ఆధార్ సీడింగ్ చేయించుకోని రైతులు 443 మంది ఉన్నారని తెలిపారు.

మేడారం జాతరకు బస్సులు

కొల్లాపూర్: మేడారం సమ్మక్క సారక్క జాతర కోసం కొల్లాపూర్ నుంచి ఆర్టీసీ బస్సులు పంపుతున్నట్లు డీఎం ఉమాశంకర్ తెలిపారు. ఈనెల 17వ తేదీన కొన్ని బస్సులు, 20వ తేదీన కొన్ని బస్సులు జాతరకు నడపనున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ వరకు కొల్లాపూర్ ప్రాంతంలో రెగ్యులర్‌గా తిరిగే బస్సు సర్వీసులను తగ్గించనున్నట్లు వెల్లడించారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

18న రాజ్యాంగ వజ్రోత్సవ సభ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 18న దేవకీ ఫంక్షన్‌హాల్‌లో రాజ్యాంగ వజ్రోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యుడు మద్దిలేటీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సభకు ప్రధాన వక్తగా ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ ఫార్మర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ పీఎస్‌ఎన్ మూర్తి హాజరవుతున్నారని అంబేద్కర్ వాదులు, రాజ్యాంగ స్ఫూర్తి కలిగిన వారు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసన్

కొల్లాపూర్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పరిగి మున్సిపాలిటీ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి


బస్రీనా బేగం

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల ఉన్నత పాఠశాలకు విద్యార్థిని బస్రీనా బేగం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజశేఖర్‌రావు, పీఈటీ వినయ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో నిర్వహించిన సబ్‌జూనియర్ విభాగంలో బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. సూర్యాపేట జిల్లా చింతల పాలెంలో ఈ నెల 18న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు.

మాదిగల నివాసాలు కూల్చడం తగదు

కొల్లాపూర్: హైదరాబాద్‌లోని వివేకానందనగర్ బస్తీలో మాదిగలకు చెందిన నివాసాలను కూలివేయడం దారుణమని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రవర్ణాలకు చెందిన వారి భవనాల పక్కన గుడిసెలు వేసుకుని జీవిస్తున్నందునే నివాసాలను ప్రభుత్వం కూల్చివేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు.

పాఠశాల వద్ద కంపచెట్ల తొలగింపు

కోడేరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆదర్శ పాఠశాలలో హాస్టల్, పాఠశాల వద్ద కంపచెట్లు ఏపుగా పెరగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉదయం వేళలో తరగతి గదుల్లోకి పాములు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయంపై యువజన సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి జేసీబీ సాయంతో కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖరీం, సురేష్, రాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నడిగడ్డకు చెందిన జుంపాల కాశన్న ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా శుక్రవారం నడిగడ్డ బ్రిడ్జి సమీపంలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


కొల్లాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న కార్మికులు


కోడేరులో బంద్ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


కల్వకుర్తిలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

హక్కులను కాలరాస్తే సహించం

కోడేరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామీణ బంద్‌ను సీపీఎం నాయకులు నిర్వహించారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం వ్యతిరేక రైతు చట్టాలను అమలు చేస్తుందన్నారు. మోసపూరితమైన కుట్రతో దేశాన్ని ఏలుతున్న బీజేపీ ప్రభుత్వం గుట్టును విప్పేందుకు సమ్మె కొనసాగిందన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాజేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: కార్మికుల పేరుతో కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు పండించే అన్ని పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటిస్తూ చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణంలో అసంఘటిత రంగ, సంఘటిత రంగ కార్మికుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేష్, దేశ్యానాయక్, శంకర్‌నాయక్ మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మికులు నిర్మల, పర్వతాలు, వెంకటయ్య, గోపాల్, చందు, పార్వతమ్మ, భారతి, మంజుల, సృజన, జయప్రద, కృష్ణవేణి, సుల్తాన్, ని రంజన్, రజిత, కల్పన, శోభ, భారతి, రజిత పాల్గొన్నారు.

మతతత్వ విధానాలను వ్యతిరేకిద్దాం

కల్వకుర్తిరూరల్: దేశంలోని భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించారు.



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సమావేశానికి ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులు, విలేజ్ బుక్‌కీపర్స్, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొదట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రపంచంలో భారత్ ఆకలిలో 111వ స్థానంలో ఉందని ఈ నరేంద్రమోదీ కార్పొరేట్ సంస్థల వల్లే జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫాసిస్టు విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ శ్రీనుకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఆనంద్‌కుమార్, మల్లయ్య, బాల్‌రెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరల చట్టం తేవాలి

కేంద్ర ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తీర్చేందుకు కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన బిల్లు తీసుకురావాలని రైతు సంఘం నాయకుడు కిశోర్ డిమాండ్ చేశారు. మండలంలోని మార్చాల, యంగంపల్లి, వెంకటాపూర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేశారు.

కార్మికుల హక్కులు పరిరక్షించాలి

కొల్లాపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా పట్టణంలో వివిధ ప్రజాసంఘాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి ప్రధాన వీధులగుండా ర్యాలీ సాగింది. కార్మికుల హక్కులను కాపాడేందుకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో శివవర్మ, రాజ్‌కుమార్, మల్లేష్, కళావతి, లక్ష్మి, హనుమంతు, రాజు, బాలపీరు, సలీం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


గ్రామంలో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పండుగను పురస్కరించుకుని శుక్రవారం అలువేలు మంగసమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఉదయం స్వామి వారికి పల్లకీ సేవ, ఇతర సేవలతో పాటు సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ, ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8గంటలకు కుంకుమార్చన, రాత్రి 9:30 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కల్వకుర్తి: సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిద్దామని మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో సేవాలాల్ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. 19న పట్టణంలోని ఎస్టీ కమ్యూనిటీ హాల్ వద్ద వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ నాయక్, నిరంజన్ నాయక్, దేవీలాల్ చౌహాన్, శంకర్ నాయక్, దాస్యానాయక్, రమేష్ నాయక్, సక్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి

అచ్చంపేట రూరల్: అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుల గణన తీర్మానానికి ఆమోదం తెలపడంతో శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. రాజీవ్‌చౌరస్తాలో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ కుల గణనతో పాటు ఇతర కులాల గణనపై అసెంబ్లీ ఆమోదం తెలపడం సంతోషించదగ్గ విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్, కాశన్నయాదవ్, సతీష్, రామనాథం, చంద్రమోహన్, మహబూబ్‌అలీ, శ్రీశైలం, తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.


అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

తెలకపల్లి: పదోతరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ గోవిందరాజులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలనా దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందని, ఉన్నతమైందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, వెంకటేష్, తేజ, శివప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

కొనసాగిన క్రీడాపోటీలు



కొల్లాపూర్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గిరిజన భవన్ వద్ద నిర్వహిస్తున్న క్రీడా పోటీలో రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. పోటీలను ఆర్డీఓ నాగరాజు ప్రారంభించారు. రెండో రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో యువకులు తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో హన్మంతునాయక్, బస్సీరాం నాయక్, కేతావత్ శంకర్‌నాయక్, గోవింద్ నాయక్, అశోక్, గోపాల్, బాలునాయక్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కందనూలు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదాయ పన్ను పరిమితిని రూ.10లక్షలు పెంచాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. జగదీష్, వెంకటేష్, షరుద్దీన్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

అమ్రాబాద్: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు నాణ్యవంతంగా చేయించాలని ఉపాధిహామీ పథకం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి కృష్ణారావు సూచించారు. శుక్రవారం మండలంలోని కుమ్మరోనిపల్లి, మాదవానిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. నర్సరీలు, వాలు కట్టలు, పనులు పరిశీలించి పనుల నాణ్యతపై ఉపాధిహామీ సిబ్బంది, కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీల సంఖ్య పెంచాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని వివరించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు


ఎల్లికట్టలో కల్యాణ మహోత్సవం

తాడూరు: ప్రతి ఒక్కరు స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బలాన్‌పల్లిలో నిర్వహించిన సూర్యదేవుడి కల్యాణోత్సవం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సూర్యదేవాలయం బలాన్‌పల్లిలో ఉండడం అందరికి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

మండలంలోని సూర్యదేవాలయ ఆవరణలో పంచమ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఛాయాదేవీ, సూర్యదేవుడి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు భగవద్గీత పారాయణం, అభిషేకం, అన్నదాన వితరణ, రైతులచే ఎద్దుల బండ్ల ఊరేగింపు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. ఎల్లికట్టలో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండలంలోని తాండ్రలో రథసప్తమిని పురస్కరించుకుని శివాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. గణపతి ఆలయంలో పూజలు నిర్వహించి శివమాలదారులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


తాడూరులో కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం

బల్మూర్: మండలంలోని అనంతవరంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు చిక్కుడు అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలికలు చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ఉమెన్స్ సబ్ సభ్యురాలు అనిత

పెద్దకొత్తపల్లి: సమాజంలో బాలికలు చదువుకుంటే ఉన్నత భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం మద్దిలేటి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉమెన్ సబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. బేటీ బచావో, బేటీ పడావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం బాలికలకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉమెన్స్ సబ్ సభ్యురాలు అనిత అన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ యూనివర్సిటీలను, ఉన్నత విద్యాసంస్థలను ధ్వంసం చేసే చర్యలకు పూనుకుంటుందని ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మండిపడ్డారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వారికి మద్దతు ప్రకటించి అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల యూజీసీ నూతన విద్యావిధానంలో డి రిజర్వేషన్ పద్ధతి తీసుకువస్తున్నారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఫలితంగా బలహీన, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమేనని ఆరోపించారు. శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మధుగౌడ్, నరేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధుగౌడ్

ఆలయంలో ముగిసిన పూజలు


అంకిరోనిపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామమైన అక్కారంలో మూడు రోజులుగా ఆంజనేయస్వామి నూతన దేవాలయంలో నిర్వహిస్తున్న పూజలు శుక్రవారం ముగిశాయి. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పంచగవ్యప్రాశన, 108 అష్టోత్తర శత కలశాభిషేకం, నవగ్రహ ఆంజనేయస్వామి హోమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అంకిరోనిపల్లిలో పద్మావతి అలర్మేల్ మంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులైన విద్యార్థులు

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓ, ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయులుగా ఒక రోజు వ్యవహరించారు. ప్రతిభ చాటిన వారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయేందర్ సింగ్, ఉపాధ్యాయులు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నారుమడిపై రైతులకు అవగాహన

తెలకపల్లి: వరినారు ఎలా నాటుకోవాలనే విషయంపై పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు మండలంలోని పర్వతాపూర్ రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులు వరినాటే ముందు నారును ముంచి నాటాలని సూచించారు. ఈ పద్ధతిలో క్లోరోఫైరిస్టాన్ ఎంఐఎల్ రసాయనాన్ని లీటర్ నీటిలో కలిపి నారును ఆ మిశ్రమంలో సుమారు 12 గంటల పాటు ఉంచాలని తెలిపారు. ముంచిన నారును 12 గంటల తర్వాత ప్రథమ పొలంలో నాటుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల తర్వాత 30 రోజుల వరకు కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, పచ్చ దోమ, సుడిదోమ వంటి చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. వరినారు నాటేందుకు పొలాన్ని సిద్ధంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఏ సమయంలో ఎంత మోతాదులో నీళ్లు పెట్టుకోవాలో, ఎరువులు, మందులను ఎలా పిచికారి చేసుకోవాలనే దానిపై వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు, అనూజ, సుభద్ర, రైతులు పాల్గొన్నారు.


వరినాటే విధానంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

తాడూరు: మండల ఎంపీడీఓగా జ్యోతి పరూసియా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన ఎంపీడీఓ గంగమోహన్ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు.

చారకొండ ఎంపీడీఓగా ఇసాక్ హుస్సేన్

చారకొండ: మండల ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా మైళ్లవరం నుంచి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ గత నెలలో అకస్మికంగా మృతి చెందడంతో ఎంపీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయంలో సిబ్బంది స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలపారు.

కొల్లాపూర్ ఎంపీడీఓగా పట్టాభి రామారావు

కొల్లాపూర్: ఎంపీడీఓగా పట్టాభి రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులతో సమావేశం అయ్యారు.

పెంట్లవెల్లి: మండల ఎంపీడీఓగా ప్రసన్న కుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా మండల పంచాయతీ కార్యదర్శులు, పలువురు నాయకులు కలిసి సన్మానించారు.

వెల్దండ: మండల ఎంపీడీఓగా సత్యపాల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

బల్మూర్: మండల ఎంపీడీఓగా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న దేవన్న మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్‌కు బదిలీ కాగా తెలకపల్లిలో విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌ను మండలానికి బదిలీ చేశారు.

కల్వకుర్తిరూరల్: ఎంపీడీఓగా వెంకట్‌రాములు బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీలో భాగంగా కల్వకుర్తికి నియామకమయ్యారు.

లింగాల: మండల ఎంపీడీఓగా బాల్‌రాజ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన గీతాంజలి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా, నల్లగొండ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చిన బాల్‌రాజ్‌రెడ్డి విధుల్లో చేరారు.